సాక్షి సిద్దిపేట

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



పలుకే బంగారమాయే

పెళ్లిళ్ల వేళ పసిడి ధర చుక్కలు చూపిస్తుండడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు.

వివరాలు 8లో ▸



సైబర్ నేరాలపై

సైబర్ నేరాలపై ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోందని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు.

వివరాలు 8లో ▸



సర్వే తప్పుల తడక

ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేలో తప్పుల తడకగా సాగింది. గతంలోనే ఇళ్లు వచ్చినట్లు తిరస్కరణ.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన తప్పనిసరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి స్వాతి రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): సమస్యలు పరిష్కరించుకోవడానికి, న్యాయం కోసం పోరాడటానికి చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ సెక్రటరీ స్వాతిరెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగల్ సెర్వీసెస్ అథారిటీ ద్వారా కోర్టుకు వచ్చి ఉచితంగా న్యాయం పొందవచ్చన్నారు. బాలల చట్టాలపై, హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి ప్రవర్తన కలిగి జీవిత లక్ష్యాలను సాధించాలన్నారు. అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్నేహలత, రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే విద్యార్థినులకు అందించే భోజనాన్ని, పరిసరాలను పరిశీలించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

కలెక్టర్ ఉత్తర్వులు జారీ

అక్కన్నపేట(హుస్నాబాద్): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామిపై వేటు పడింది. ఈ మేరకు బుధవారం కలెక్టర్ మను చౌదరి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేసినట్లు ఎంపీడీఓ భానోతు జయరాం తెలిపారు. ఇటీవల అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండరాళ్లు మీద పడి తల్లీకూతుళ్లు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విధుల పట్ల బాధ్యతరహితంగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు. ఇక నుంచి ఉపాధి హామీ పని ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్య దర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదంలో మృతి చెందిన తల్లి, కూతురు కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కింద రూ. 2లక్షల చొప్పున త్వరలో అందజేస్తామన్నారు.

సంచార జాతులను ఆదుకోండి

పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశం



మాట్లాడుతున్న వెంకటేశం

కోహెడ(హుస్నాబాద్): సంచార జాతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక సంక్షేమ సంఘం భవనంలో విలేకరుతో మాట్లాడారు. కుల వృత్తి గాజుల వ్యాపారం నడవక మహిళలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నరని అన్నారు. పురుషులు సైతం గొడుగులు, గ్యాస్‌స్టవ్ రిపేర్లు, తాళాల విక్రయం తదితర వార సంతలలో వ్యాపారం చేసుకుంటూ పొట్ట నింపుకునే పరిస్థితి ఉందన్నారు. ఈజీఎస్ జాబ్ కార్డుతో సంబంధంలేకుండా రూ.12వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద గుర్తించాలని మంత్రి పొన్నంకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి, రమేశ్, సత్యనారాయణ, రవి, సుధాకర్, రాజు, రాజమౌళి, జయరాం, సమ్మవ్వ, భవాని పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

సిద్దిపేటకమాన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన మండలిలోకి కార్పొరేట్ శక్తులు సభ్యులుగా వెళ్తే ప్రభుత్వ ఉపాధ్యాయుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. యుటీఎఫ్, ఎస్టీయూ, పీఆర్టీయూ జేఏసీలతో పాటు జూనియర్, డిగ్రీ యూనివర్సిటీల అధ్యాపకుల మద్దతు తమకే ఉందన్నారు.ఈ నెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో భూపాల్, శ్రీధర్, యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు.



గోదారి సోయగం.. హరిద్ర ఆహ్లాదం

గోదారమ్మ పరవళ్లతో నాచగిరి హరిద్రాతీరం ఆహ్లాదకరంగా మారింది. పొంగి పొర్లుతున్న హల్దీ చెక్‌డ్యాం పర్యాటకులకు కనువిందుచేస్తోంది. కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల విడుదలతో చెరువులు, హల్దీ వాగు జలప్రవాహంతో కళకళలాడుతున్నాయి. – వర్గల్(గజ్వేల్)



సూర్యోదయం.. స్వర్ణ వర్ణ శోభితం

ఉదయిస్తున్న భానుడి కిరణాలతో బుధవారం కోమటి చెరువు స్వర్ణ వర్ణ శోభితమైంది. సూర్యుడి కిరణాలతో చెరువు చూడముచ్చటగా దర్శనమిచ్చింది. ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. స్వర్ణ వర్ణంలో నీటిపై ప్రతిబింబించే దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మంది. – సిద్దిపేటజోన్

కోతలకు చెక్

ఇక నిరంతరం విద్యుత్ సరఫరా

- జిల్లాలో రూ.45కోట్లతో వివిధ పనులు
- వేసవిలో ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు
- ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు
- వచ్చే నెలలో 285 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించే అవకాశం



సిద్దిపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనులు చేస్తున్న సిబ్బంది

రానున్న వేసవిలో విద్యుత్ అంతరాయాలను అధిగమించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా అధికారులు దృష్టి సారించారు. లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గతేడాది ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.45 కోట్లతో సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు, 33 కేవీ, 11కేవీ విద్యుత్ లైన్‌లు, కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులన్నీ ఈ నెలాఖరులోగా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

సాక్షి, సిద్దిపేట: వచ్చేది వేసవి కాలం. పైగా వచ్చే నెలలో 285 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపడుతున్నారు. ఇందుకు ప్రత్యేక అధికారిగా సీజీఎం సాయి బాబాను నియమించారు. 2023 మార్చి నెలలో 5.15లక్షల విద్యుత్ కనెక్షన్లకు 220 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. 2024 మార్చిలో 5.35లక్షల కనెక్షన్లు ఉండగా 253 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 5.80,553 కనెక్షన్లు ఉండగా 285 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మార్చిలో వివిధ పంటల సాగు కోసం బోర్‌లను ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో ప్రతి ఏడాది మార్చిలోనే ఎక్కువ విద్యుత్ వినియెగం జరుగుతోంది.

ముందస్తు చర్యలు

వేసవి కాలంలో ఏసీలు, కూలర్లు, వ్యవసాయానికి ఎక్కువగా విద్యుత్‌ను వినియోగించనున్నారు. 33 కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్ పైన 300 ఆంప్స్ కంటే ఎక్కువ లోడ్ పడకుండా చర్యలు చేపడుతున్నారు. అలాగే 11 కేవీ సబ్‌స్టేషన్లపై 150 ఆంప్స్ కంటే ఎక్కువ లోడ్ పడకుండా చర్యలు తీసుకోనున్నారు. అలాగే 200 డీటీఆర్‌లను ఆయా సబ్ స్టేషన్లను అదనంగా అందుబాటులో ఉంచుతున్నారు. ఈ నెలాఖరులోగా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో పొందుపరిచిన పనులు అన్ని పూర్తి చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నిరంతరం విద్యుత్ అందిస్తాం



24 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తాం. వ్యవసాయానికి 18గంటలు త్రీఫేస్, 6గంటలు సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా చేస్తాం. జిల్లా వ్యాప్తంగా 9చోట్ల ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతుల కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యుత్ అంతరాయం ఏర్పడితే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

– చంద్రమోహన్, ఎస్ఈ, టీజీఎస్‌పీడీసీఎల్

సామర్థ్యం పెంపు

సిద్దిపేట టౌన్, కరకపట్ల(గజ్వేల్), చిట్టాపూర్(దుబ్బాక), రాంపూర్, మర్రిముచ్యాలలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచనున్నారు. అలాగే 33 కేవీ విద్యుత్ లైన్లను 8చోట్ల 40 కిలో మీటర్లు, 11కేవీ లైన్‌లు 60 చోట్ల 300 కిలోమీటర్లు కొత్త లైన్‌లు వేయనున్నారు. 500 చోట్ల కొత్తగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అయినాపూర్(కిష్టంపల్లి), నర్సాపూర్‌లలో కొత్తగా సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు.

కులగణన చరిత్రాత్మకం

- బీజేపీకి దమ్ముంటే దేశవ్యాప్తంగా చేపట్టాలి
- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి
- గజ్వేల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నర్సారెడ్డి తదితరులు

గజ్వేల్: రాష్ట్రంలో చేపట్టిన కులగణన చరిత్రాత్మకమని, బీజేపీకి దమ్ముంటే దేశవ్యాప్తంగా కులగణన సర్వే చేపట్టాలని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం గజ్వేల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలతో ముందుకుసాగుతున్నదని చెప్పారు. పకడ్బందీగా కులగణన చేపట్టడం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధిని చాటుకున్నారని కొనియాడారు. మరోవైపు ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న ఎస్సీ వర్గీకరణ సైతం ఆమోదం పలకడంతో రేవంత్‌రెడ్డి చరిత్ర సృష్టించారని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి వర్గీకరణ అమలు చేస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ పెరుగుతుండగా... బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు మింగుడు పడటం లేదన్నారు. ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆ రెండు పార్టీల తీరును ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గజ్వేల్ కాంగ్రెస్ నేత చాడ రామరాజు పంతులు వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు.

సృజనాత్మక ఆలోచనలతోనే

యువత శక్తివంతం

- ఆవిష్కరణలతో సమస్యలకు పరిష్కారం
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేటఎడ్యుకేషన్: సృజనాత్మక ఆలోచనలతో యువత శక్తివంతం అవుతుందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. ఈ నేపథ్యంలోనే యువ ఆవిష్కరణలపై సదస్సులు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ సెల్(టీఎస్ఐసీ), యూనిసెఫ్‌ల సంయుక్తాధ్వర్యంలో బుధవారం కళాశాలలో విద్యార్థులకు యువ ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని తీవ్ర సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు విద్యార్థులకు అవసరమైన జ్ఞానం, మెంటర్‌షిప్‌ను అందించడంతో పాటు ఇంక్యుబేషన్ మద్దతును అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్ఐ కోఆర్డినేటర్ డాక్టర్ అంజని మాట్లాడుతూ కార్యక్రమాన్ని మూడు దశల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు చివరిదశలో ఇంటర్న్‌షిప్‌లు, రివార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ గోపాలసుదర్శనం, అధ్యాపకులు డా. ఉమామహేశ్వరి, డా. లీలావతి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

కులచిచ్చు పెడుతున్న ప్రభుత్వాలు

మాల మహానాడు రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ శ్రీరాములు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

దుబ్బాక: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల, మాదిగల మధ్య కులచిచ్చు పెడుతూ రాజకీయాలు చేయడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు అన్నారు. బుధవారం దుబ్బాకలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు వర్గీకరణ చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, లింగం, చిన్నముత్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే అరెస్టులా?

గజ్వేల్‌లో నల్లబ్యాడ్జీలతో వీఆర్‌ఏల నిరసన

గజ్వేల్: నల్లబ్యాడ్జీలతో వీఆర్ఏలు నిరసన తెలిపారు. సమస్యలు చెప్పుకోవడానికి మంత్రి వద్దకు వెళితే అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం వీఆర్ఏలు నల్లబ్యాడ్జీలతో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్(ఐఓసీ)లోని ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. 18 నెలలుగా తమ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యపై స్పందించకపోతే పోరాటాలను ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ ఏల సంఘం నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్, నర్సింలు, చందు, సుందర్, భిక్షపతి, ఐలయ్య, లక్ష్మీ నర్సయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాల్సిందే

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిందేనని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని కిష్టాపూర్, అల్లీపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా వండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించి స్థానిక ఎన్నికల్లోకి రావాలన్నారు. కేసీఆర్ నిర్వహించిన సకల జనుల సర్వేలో 53 శాతం బీసీలు ఉన్నారని తేలిందన్నారు. నేటి కాంగ్రెస్ సర్వేలో 42 శాతం చూపించడం ఇంతకంటే దగా పాలన మరొకటి ఉంటుందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్, కనకరాజు, పాపయ్య, రవీందర్ రెడ్డి, ఉమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యతను చాటినప్పుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమలోని నైపుణ్యతను చాటినప్పుడే గుర్తింపు లభిస్తుందని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం, టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...గజ్వేల్ పరిసరాలతోపాటు కళాశాలకు చెందిన పలువురు నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొనగా సదాశివపేటకు చెందిన ఎవరెస్ట్ ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థలో 25మంది ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అలివేలు, కెప్టెన్ డాక్టర్ భవాని, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ కవితతోపాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

ప్రణాళిక బద్ధంగా చదవాలి
జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): విద్యార్థులు పరీక్షల వేళ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లిలో బుధవారం ములుగు, వర్గల్, మర్కూక్ మండలాలకు చెందిన టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని సాధనకు శ్రమించాలన్నారు. ప్రణాళిక బద్ధంగా సిలబస్‌ను నిర్దేశించుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించేందుకు కావాల్సిన మెలకువలు, ప్రేరణ కల్పించారు. విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ములుగు, మర్కూక్, వర్గల్ మండలాల విద్యాధికారులు ఉదయ్‌బాస్కర్‌రెడ్డి, సునీత, వెంకట్ రాములు, శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణుజగతి, ప్రధాన కార్యదర్శి మల్లేషం, కోశాధికారి ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొట్లపల్లి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- భక్తులకు ఇబ్బందులు రానివ్వం
- మహాశివరాత్రి ఉత్సవాలపై ఆర్డీఓ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల (జాతర)కు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆర్డీఓ రామ్మూర్తి తెలిపారు. ఈ నెల 25, 26న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలపై బుధవారం స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భక్తులకు సమస్యలు తలెత్తకుండా వివిధశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఏటా స్వామివారి దర్శనం కోసం లక్షకు పైగా భక్తులు వస్తారని అన్నారు. భక్తులను క్యూ పద్ధతిలో పంపిస్తే సమస్యలు రావన్నారు. జాతరలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ మల్లికార్జున్‌కు సూచించారు. భక్తులకు తాగునీరు, నీడ, భోజన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. హుస్నాబాద్ నుంచి పొట్లపల్లికి వచ్చేందుకు శివరాత్రి రోజు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపించాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఏసీపీ సతీష్ పోలీసు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ఆలయంలో వీఐపీ దర్శనాలను తగ్గించి సాధారణ దర్శనాలను సులభతరం చేయాలని ఈఓ కిషన్‌రావుకు సూచించారు. వారం రోజుల ముందే ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దారు రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యూత్ పార్లమెంట్ రీజియన్ పోటీల్లో ప్రతిభ

– వర్గల్ నవోదయకు ద్వితీయ స్థానం



జ్ఞాపికను అందజేస్తున్న బీపీ ఆచార్య

వర్గల్(గజ్వేల్): మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లా నావోగావ్‌కేరి నవోదయ విద్యాలయ వేదికగా నిర్వహించిన రీజియన్ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీల్లో సిద్దిపేట జిల్లా వర్గల్ నవోదయ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మంగళవారం రీజియన్ స్థాయి ఫైనల్స్‌లో గుజరాత్ రాష్ట్రం వల్సాడ్ నవోదయ, వర్గల్ నవోదయ విద్యార్థులు వేర్వేరుగా 'యూత్ పార్లమెంట్' కార్యక్రమాన్ని కళ్లకు కట్టారు. స్పీకర్, ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, హోం మంత్రి తదితర పాత్రల్లో జీవించారు. ప్రశ్నలతో నిలదీశారు. తీర్మానాలు ఆమోదించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రెటరీ బీపీ ఆచార్య బుధవారం ఫలితాలు ప్రకటించినట్లు వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. వల్సాడ్ ప్రథమ, వర్గల్ ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఎనిమిది మంది విద్యార్థులకు ప్రశంసలు దక్కాయని వివరించారు. ఈ సందర్భంగా ఎస్కార్ట్ టీచర్లను, యూత్‌పార్లమెంట్ టీం విద్యార్థులను అభినందించారు.

సుధారాణికి డాక్టరేట్



సుధారాణిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

మెదక్‌జోన్: మెదక్ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్రం అధ్యాపకురాలు సుధారాణికి రాజస్థాన్‌లోని విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. రాజస్థాన్‌లోని జగదీష్ ప్రసాద్ జబ్బర్మల్ టిబ్రేవాలా విశ్వవిద్యాలయంలో డాక్టర్ నితిక చౌదరి పర్యవేక్షణలో స్టడీ ఆన్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఆర్గానిక్ అండ్ సెమీ ఆర్గానిక్ క్రిస్టల్స్ అండ్ ఇట్స్ గ్రోత్ అంశంపై చేసిన పరిశోధనకు డాక్టర్ అందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సింహారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ తిరుమల రెడ్డి, శరత్ రెడ్డి, ప్రణీత్ కుమార్, ఆమనమూర్తి, శ్రీలత, అరుంధతి పాల్గొన్నారు.

పాత కక్షలతో దాడులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పాత కక్షలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న ఘటన కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామంలో చోటు చేసుకుంది. జగదేవ్‌పూర్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బక్కోల్ల యాదయ్య లారీ ఓనర్‌గా ఉండగా, ఇదే గ్రామానికి చెందిన బక్కోల్ల యాదగిరి కూలీ పనులు చేస్తుంటాడు. వీరి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు నెలకొన్నాయి. బుధవారం ఇరువురు కలిసి మద్యం తాగుతున్న సమయంలో వాగ్వాదం నెలకొనడంతో పాత కక్షలను మనసులో పెట్టుకొని ఒకరిపై మరొకరు బీరు సీసాలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. జగదేవ్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసుకోగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి పంపించి పోలీసులు కేసు నమోదు చేశారు.

పలుకే బంగారమాయే



పెళ్లిళ్ల వేళ పసిడి ధర చుక్కలు చూపిస్తుంది. గతేడాది కాస్త తగ్గుముఖం పట్టినట్లు కనిపించడంతో రాబోయేది పెళ్లిళ్ల సీజన్ కావడంతో ముందే కొనేసుకుందాం అని అనుకున్నారు. కానీ పసిడి మాత్రం తగ్గేదేలే అంటూ పెరుగుతూ వస్తుంది. దీంతో శుభకార్యాలకు బంగారం కొనేవారు బెంబేలెత్తిపోతున్నారు. బుధవారం 10 గ్రాముల బంగారం రికార్డు స్థాయిలో రూ.87,500 పలికింది. వెండి ధర 10 గ్రాములకు రూ.970 నమోదు అయ్యింది. దీంతో వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

పాపన్నపేట(మెదక్):

- రికార్డు స్థాయిలో బంగారం
- 10 గ్రాముల ధర రూ.87,500
- పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల ఆందోళన
- జిల్లాలో 80 పైగా దుకాణాలు

రికార్డు స్థాయిలో పసిడి పైపైకి..

గత 20 ఏళ్లలో బంగారం, వెండి ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో బంగారం ధర కొండెక్కి కూర్చుంది. దేశీయంగా డాలర్ విలువ రూ.87.36 కావడంతో మన దేశంలో పసిడి మరింత భగ్గుమంటుంది. 2004 ఏప్రిల్ బంగారం ధర 10 గ్రాములు రూ.5,800 ఉంది. 2024 ఏప్రిల్ నాటికి రూ.71,300కు పెరిగింది. కాగా ఫిబ్రవరి 5న నాటికి ఎప్పుడూ లేని రీతిలో రికార్డు స్థాయిలో రూ.87,500 పలికింది. వెండి 10 గ్రాములకు రూ.970 నమోదయ్యింది. గత డిసెంబర్‌లో రూ.72 వేలు, ఈ జనవరిలో రూ.74 వేలు ఉండగా వారం రోజుల్లోనే అమాంతంగా పెరిగింది. జిల్లాలో మెదక్ కేంద్రంగా బంగారం వ్యాపారం జోరుగా సాగుతుంది. ఇక్కడ సుమారు 80 వరకు బంగారు దుకాణాలు ఉండగా, సీజన్‌లో రోజుకు రూ.కోటి టర్నోవర్ జరుగుతుంది. అయితే ఈ మధ్యలో ధరలు



పెరగడంతో గిరాకీ తక్కువగా ఉంటుందని వ్యాపారులు వాపోతున్నారు.

పెళ్లికి కొనలేని పరిస్థితి..

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ ప్రారంభంకావడంతో బంగారం ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఇంట్లో పెళ్లి చేస్తే వధువుకు ఎంత లేదన్నా కనీసం 5 తులాల పైగానే బంగారం పెడుతుంటారు. ఈ మధ్యలో మగ పెళ్లివారు కట్నకనుకలు అడుగకుండా మీ అమ్మాయికి ఇంత బంగారం పెడితే చాలు అంటూ తెలిగ్గా చెప్పేస్తున్నారు. దీంతో పెళ్లి కూతురు తరపున వారు బంగారం ధర చూసి నోరెల్ల బెడుతున్నారు. పెళ్లి ఖర్చుకంటే బంగారానికే ఎక్కువ ఖర్చు అవుతుందని, రూ.లక్షలు పెట్టి కొనలేక వెనక్కి తగ్గుతున్నారు. ఈ సీజన్‌లో పసిడి ధర మరింత పైకి వెళ్లే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

తలకు మించిన భారం



బంగారం ధరలు ఇలా పెరిగితే ఎలా కొంటాం. ఆడ కూతుళ్ల పెళ్లిళ్లు చేయాలంటే మధ్య తరగతి కుటుంబాలకు తలకు మించిన భారం అవుతోంది. ఈ రోజుల్లో ఎంత లేదన్నా అమ్మాయికి కనీసం 10 తులాలు పెట్టాలి. ఇలా ధరలు పెరిగితే వారి పరిస్థితి ఏంటి. ఈ రోజు రూ.87,500 తులం బంగారం ఉంది. ప్రభుత్వం స్పందించి బంగారం ధరలపై నియంత్రణ ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

– కుకూనూరు స్వప్న, గృహిణి, పాపన్నపేట

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్

సిద్దిపేటఅర్బన్: సైబర్ నేరాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించి ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. సైబర్ జాగ్రుక్త దివస్‌లో భాగంగా బుధవారం సిద్దిపేటలోని ఐటీ టవర్‌లో ఐటీ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్, జంప్డ్ డిపాజిట్, నకిలీ విద్యుత్ బిల్లులు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, రుణ యాప్‌ల మోసాలు, ఆన్‌లైన్ పేమెంట్స్, కొరియర్ ఫ్రాడ్స్, ఓటీపీ, నకిలీ వెబ్‌సైట్స్ వంటివి ఎక్కువగా ఉన్నాయని వివరించారు. సెల్‌ఫోన్ వల్ల ఎన్ని



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

ఉపయోగాలు ఉన్నాయో అన్ని అనర్థాలు కూడా ఉన్నాయని, సెల్‌ఫోన్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడిన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

మంచానికి బీడీ అంటుకొని మంటలు

గాయాలతో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని మంచంతోపాటు కాలి గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గౌరయపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు కథనం మేరకు.. గౌరయపల్లి గ్రామానికి చెందిన లింగయ్య(75) మంగళవారం మంచంలో నిద్రించి అలవాటుగా బీడీ వెలిగించాడు. ప్రమాదవశాత్తు మంచం నిప్పు అంటుకోగా లింగయ్యకు సైతం గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి హైదరాబాద్‌లో ని గాంధీ ఆస్పత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలైన వ్యక్తి

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గజ్వేల్‌లో బుధవారం చోటు చేసు కుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన నాయిని కుమారస్వామి(40) ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైద్రాబాద్‌లో నివాసముంటున్నాడు. 2న పని ఉండగా గజ్వేల్‌కు వచ్చిన కుమారస్వామి తిరిగి 3న కారులో బయలుదేరాడు. మున్సిపాలిటీ పరిధిలోని లింగరాజ్‌పేట సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కుమారస్వామికి రెండు కాళ్లు విరిగిపోగా, ఛాతిలో బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సికింద్రాబాద్‌లో ని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందు తూ బుధవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుంటలో పడి యువకుడు మృతి

ములుగు(గజ్వేల్): ప్రమాదవశాత్తు కుంటలో పడి యువకుడు మృతి చెందిన ఘటన ములుగు మండలం బండమైలారంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రవణ్‌కుమార్(23) మూడు నెలలుగా బండమైలారంలోని ఓ పరిశ్రమలో పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 3 నుంచి శ్రవణ్‌కుమార్ కనిపించకుండా పోయాడు. కుటుంబీకులు వెతుకుతుండగా బుధవారం అతడు పనిచేసే పరిశ్రమ సమీపంలోని రాణికుంటలో శవమై తేలాడు. కుంటలోకి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెంది ఉంటాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి బావ అమరేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో : ఇద్దరికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను గూడ్స్ ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు గోనెమ్మ బస్తీకి చెందిన సందీప్ కుమార్ మంగళవారం బైక్‌పై స్నేహితుడు రమేశ్‌తో కలిసి వెళ్తున్నాడు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సమీపంలో వెనుక నుంచి వచ్చి గూడ్స్ ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన సందీప్ సోదరుడు ప్రదీప్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను డీసీఎం ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లి శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. సిరిసిల్లా జిల్లా కేంద్రానికి చెందిన రామకృష్ణ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సొంతూరుకి వచ్చి 4న బైక్‌పై మళ్లీ హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. కుకునూరుపల్లి శివారులో పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా హైదరాబాద్ వైపునకు వెళ్తున్న డీసీఎం అతి వేగంగా వచ్చి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రుడిని గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం రామకృష్ణ భార్య దివ్య ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ రాగుల రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

సిద్దిపేటకమాన్: ఫర్నీచర్ షాపులో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని సిద్దిపేట టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. సిద్దిపేట-నర్సాపూర్‌కు వెళ్లే దారిలో కొమ్ము ఆంజనేయులు ఓ ఫర్నీచర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ముగ్గురు నిందితులు షాపులో ఐరెన్ పైపులను దొంగిలించి ఆటోలో తరలించే క్రమంలో చుట్టు పక్కల వారు గుర్తించి అరిచారు. దీంతో నిందితులు పారిపోయారు. షాపు నిర్వాహకుడు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రధాన నిందితుడు దుబ్బాకకు చెందిన నూనె స్వామిని గుర్తించాడు. బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పరిశ్రమలో విధులకు వెళ్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్
- అక్కడికక్కడే కార్మికుడు మృతి



కిరణ్ మృతదేహం

హత్నూర(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి హత్నూర మండలంలోని కాసాల గ్రామ శివారులో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసాల గ్రామానికి చెందిన పాముల కిరణ్ (35) గుండ్లమాచునూర్ గ్రామ సమీపంలో గల ఎపిటోరియా యూనిట్-9 ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్నాడు. రాత్రి విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా గ్రామ శివారులో ప్రధాన రోడ్డుపై ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిరణ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సన్మానం

ములుగు(గజ్వేల్): ములుగు ఎంపీడీఓ వెంకటరామకృష్ణ శర్మను గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు అరుణ్ కుమార్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఆయనతో పాటు బీజేపీ మండల కన్వీనర్ సత్యంయాదవ్, బూత్ అధ్యక్షుడు కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత

కొండపాక(గజ్వేల్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. కొండపాకలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో సైబర్ జాగృకత దివస్‌లో భాగంగా బుధవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

తొగుట(దుబ్బాక): సైబర్ నేరగాళ్ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి మనుగడ టిక్నాలజీతో ముడిపడి ఉందన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల కిందట తనిఖీలు నిర్వహించాం. ఆరుగురు పట్టుబడగా సిద్దిపేట కోర్టులో హాజరుపర్చాం. బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.10,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

స్వచ్ఛబడి సందర్శన

సిద్దిపేటజోన్: సిద్దిపేట బల్దియాలోని స్వచ్ఛబడిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం, సీఈవో దశరథ్‌రాం బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణ, తడి పొడి, హానికర చెత్త విభజన ప్రక్రియ గురించి ఆరా తీశారు. అనంతరం డీఆర్సీ కేంద్రాన్ని పరిశీలించారు. డంప్‌యార్డ్ పరిశీలించి, తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. బయో గ్యాస్ తయారీ, వినియోగం, దాని ద్వారా మున్సిపల్‌కు ఆదాయ పరిస్థితులను ఆరా తీశారు. డిజిటల్ క్లాస్ తరగతి, పట్టణంలో అమలవుతున్న స్టీల్ బ్యాంక్, ప్లాస్టిక్ నిషేధం జ్యూట్ క్లాత్ బ్యాంక్ తదితర అంశాలను గురించి క్షేత్రస్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గుండెపోటుతో పీఈటీ మృతి

దుబ్బాకటౌన్: రోజూ తమకు క్రమ శిక్షణ నేర్పుతూ.. ఆటలు ఆడించే పీఈటీ ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో విద్యార్థులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. స్థానికుల వివరాల ప్రకారం.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాశికంటి అశోక్ (48)కు బుధవారం ఉదయం 3.30 గంటల సమయంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఉదయం 7.30 గంటలకు మరొకసారి గుండె పోటు రావడంతో మృతి చెందాడు. అశోక్ స్వస్థలం కొమురవెల్లి మండలం మరిముచ్చాల గ్రామం, అశోక్‌కు ఇద్దరు కుమారులున్నారు.

లక్ష డప్పుల ప్రదర్శన వాయిదా



మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: ఈనెల 7న జరుగనున్న లక్ష డప్పులు-వేల గొంతుల మహా ప్రదర్శన వాయిదా పడినట్లు ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు రాములుమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాదిగ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు శాసనసభ ఆమోదం చేసిన నేపథ్యంతో దానిలో జరిగిన లోపాలను సవరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరమున్నందున మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆదేశాల మేరకు ఈ నెల 7న నిర్వహించతలపెట్టిన లక్ష డప్పులు-వేల గొంతుల సాంస్కృతిక మహా ప్రదర్శన వాయిదా పడిందని, నూతన తేదీని మళ్లా ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, మహేశ్, రమేశ్, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య

మునిపల్లి(అందోల్): జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మున్నూర్ కృష్ణ (45) మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేకుండా పోయింది. 3న కృష్ణ భార్య సదాశివపేటలోని ఆమె అక్క ఇంటికి వెళ్లి 4న గ్రామానికి వచ్చింది. ఇంటికెళ్లి చూసేసరికి కృష్ణ ఇంట్లో దూలానికి ఉరేసుకొని కనిపించాడు. జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య మున్నూర్ లక్ష్మి బుదేరా పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేశ్ నాయక్, ఏఎస్ఐ ఏసయ్య తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి..

సిద్దిపేటకమాన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాత్రి రాజు (25) తన భార్యతో కలిసి పట్టణంలోని వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్నాడు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజు భార్య నెల కిందట డెలివరీ కావడంతో పుట్టింట్లోనే ఉంటుంది. అప్పుల బాధ భరించలేక మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఎల్లవ్వ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): విభజన హామీ ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కోత విధించడాన్ని నిరసిసస్తూ బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ మహిళా సంఘం సభ్యులతో కలిసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బడాబాబుల కడుపు నింపు, మధ్య తరగతి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని




నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

మండిపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాడూరి రవీందర్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శారద, బద్దిపడిగ కృష్ణారెడ్డి, బక్కెల్లి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కూడవెల్లి వాగు నుంచి జప్తిలింగారెడ్డిపల్లి తుంగచెరువులోకి వెళ్లే కట్టు కాలువ మరమ్మతు పనులను బుధవారం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కాలువ పూడికతీత పనులు చేపట్టకపోవడంతో చెరువులోకి నీరు వెళ్లడం లేదన్నారు. సమస్యను రైతులు తన దృష్టికి తీసుకురాగానే అధికారులతో మాట్లాడి పనులు చేపట్టాలని చెప్పానన్నారు. కాలువ గండ్లను పూడ్చివేసి పేరుకుపోయిన పూడి



జప్తిలింగారెడ్డిపల్లి చెరువులోకి నీటిని విడుదల చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కతీతను మూడు రోజుల్లోగా తొలగించాలని సూచించారు. ఈసందర్భంగా వాగు నుంచి కాలువలోకి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఐబీ డీఈఈ చెన్ను శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నిరంజన్, సత్తయ్య, చంద్రయ్య, కనకయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులను నిలువరించాలి

గజ్వేల్: స్వప్రయోజనాల కోసం ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి వస్తున్న కార్పొరేట్ శక్తులను నిలువరించాల్సిన అవసరం ఉందని కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం గజ్వేల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధన రాజకీయాలను ఓడించి ఉద్యమ నాయకులను ఎమ్మెల్సీలుగా ఎన్నుకున్నట్లయితే ప్రభుత్వ విద్య బలోపేతమవుతుందని చెప్పారు. 36ఏళ్లుగా తాను ఉపాధ్యాయ ఉద్యమంతో పాటు తెలంగాణ ఉద్యమంలో పనిచేశానని, తనకు అవకాశం కల్పిస్తే టీచర్ల గొంతుకగా పనిచేస్తానన్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజయ్య, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

గజ్వేల్‌రూరల్: అనారోగ్యం బారినపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిదని తాజా మాజీ సర్పంచ్ చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన గుర్రాల స్రవంతికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 40వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన వారు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోగా వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందించి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు నిరుపేదల్లో మనోధైర్యాన్ని కలిగిస్తుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సత్యనారాయణ, యాదగిరి, కనకరాజుయాదవ్, గణేష్, బాబు, మహేష్, బషీర్, శ్రీకాంత్‌గౌడ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడుసంతాప సభ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం జరగనున్న ఆర్. సత్యనారాయణ సంతాప సభకు అందరూ హాజరుకావాలని సత్యనారాయణ మిత్రబృందం సభ్యులు కోరారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన సత్యనారాయణ ప్రగతిశీల ప్రజాస్వామ్య ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని కొనియాడారు. పత్రికా రంగంలో తనదైన ముద్ర వేసుకున్నాడన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకోవడానికి సంతాప సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.